# దేశీయ భాషలు అంతరించకుండా కాపాడుకోలేమా !

## (21 ఫిబ్రవరి "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం" సందర్భంగా)

ప్రజలను ఏకం చేసే బలమైన సాధనం భాష మాత్రమే. ప్రపంచ ప్రజలను ఏకం చేస్తూ, ప్రజలతో విడదీయరాని బంధాన్ని భాష పెనవేసుకున్నది. భాష ఆ ప్రాంత సంస్కృతికి అద్దం పడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 8,324 భాషలు ఉన్నాయని, అందులో 7,000 భాషలు నేటికీ వినియోగంలో ఉన్నాయని యునెస్కో అధ్యయనం వెల్లడించింది. వీటిలో దాదాపు 43 శాతం భాషలు అంతరించే స్థిలో, 40 శాతం భాషసల్లో విద్యాబోధన జరగడం లేదు, కొన్నింటికి లిపి కూడా లేకపోవడం గమనార్హం. సువిశాల భారతంలో రాజ్యాంగ పరంగా 22 అధికార భాషలు ఉండగా, మాట్లాడే భాషలు/యాసలు 1,600ల వరకు ఉన్నాయి. ఇలాంటి భాషా వైవిధ్యత కు పుట్టినిల్లుగా ఉన్న భారతం భాషా వారసత్వ కేంద్రంగా భాసిల్లుతున్నది. ప్రతి రెండు వారాలకు ఒక భాష అంతరించిపోతున్నట్లు యునెస్కో వెల్లడించడం విచారకరం. ప్రతి మాతృ భాషను తల్లిలా కాపాడుకోవడం మన కనీస ధర్మం.

**అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం-2025:**

ప్రపంచ భాషలను కాపాడుకోవడం, వినియోగంలోకి తేవడం, అంతరించిపోకుండా చూసుకోవడం లాంటి లక్ష్యాలతో ప్రతి ఏట 21 ఫిబ్రవరిన ఐరాస సభ్య దేశాలు "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ మదర్ లాంగ్వేజ్ డే" పాటించడం 1999 నుంచి ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం-2025 ఇతివృత్తంగా "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ సిల్వర్ జుబ్లీ వేడుకులు" అనే అంశాన్ని తీసుకొని విస్తృతమైన ప్రచారం చేస్తున్నారు. భాషా వైవిధ్యం, బహుభాషావాదాన్ని ప్రోత్సహించడం లాంటి ప్రాధాన్యతలతో గత 25 ఏండ్లుగా ఐరాస నాయకత్వంలో భాషా పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రపంచ భాషా పరిరక్షణ చర్యల్లో భాగంగా 2022-32 దశాబ్దాన్ని "అంతర్జాతీయ స్వదేశీ (గిరిజన) భాషల దశాబ్దం"గా ప్రకటించిన పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నది ఐరాస.

**బంగ్లాదేశ్‌లో మాతృభాష ఉద్యమం-1952 :**

1947లో సువిశాల భారత విభజన సమయంలో వెస్ట్ (బంగ్లాదేశ్) పాకిస్థాన్, ఈస్ట్ పాకిస్థాన్‌లు విడిపోయి ఒకే పాకిస్థాన్‌గా ఏర్పడ్డ విషయం మనకు తెలిసిందే. నాటి పాక్ ప్రభుత్వం రెండు ప్రాంతాలకు ఉర్దూ ఏకైక అధికారిక భాషగా నిర్ణయించడంతో బంగ్లా మాతృభాష మాట్లాడే ప్రజలు నిరసన ప్రదర్శనలు చేయడంతో 21 ఫిబ్రవరి 1952న పోలీసు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించడం జరిగింది. మాతృభాష పరిరక్షణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఏట 21 ఫిబ్రవరిన "అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం" నిర్వహించుకోవడం 1999 నుంచి ఆనవాయితీగా మారింది.

**మాతృభాష ప్రాముఖ్యత:**

అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం వేదికగా భాషాభివృద్ధి సదస్సులు, బహుభాషావాదాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం, భాషలు అంతరించకుండా జాగ్రత్త పడటం, భాషా పోషకులను గుర్తించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించాలి. మాతృభాషలో చదివితే సులభంగా నేర్చుకోవడం, సృజనాత్మకతను ప్రదర్శించడం జరుగుతుంది. మాతృభాషతో ప్రజల్లో సమ్మిళిత ఐక్యత, సామాజిక-భావోద్వేగ అభివృద్ధి, సాంస్కృతిక గుర్తింపు, లింగ సమానత్వం, విలక్షణ ఆలోచనలతో ఆవిష్కరణలు, విషయ పరిజ్ఞానం లాంటివి పెరుగుతాయని మనకు తెలుసు. నేడు దాదాపు 40 శాతం విద్యార్థులు మాతృభాషను వదిలి ఇతర భాషల్లో విద్యాభ్యాసం చేయడం చూస్తున్నాం.

మాతృభాష అమ్మ రొమ్ముపాలంత తియ్యన. మాతృభాషను చులకన చేస్తే అమ్మను హేళన చేసినట్లే. మాతృభాషను గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవడం, మాతృభాషలో విద్యాభ్యాసం చేయడం, మాతృభాష అభివృద్ధికి ఆజ్యం పోయడం లాంటివి నిరంతరం జరుగుతూనే ఉండాలి. మాతృభాషలో మాట్లాడితేనే చిన్న చూపు చూసే విపరీతమైన బుద్ధులు పుట్టుకురావడం సోచనీయం. "ప్రపంచ భాషలందు మాతృభాష లెస్స" అంటూ నినాదాలు చేద్దాం. మాతృభాషను ఆత్మగా గౌరవిద్దాం, అమ్మ ముచ్చట్లను తేనె మూటలుగా ఆదరిద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వివిధ స్థాయిల్లో జరిగిన చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్రమోదీ ఆహ్వానంపై, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్- థానీ భారత్‌లో అధికారిక పర్యటనకు విచ్చేశారు. అమీర్ వెంట మంత్రులు, అధికారులు, వ్యాపార ప్రముఖులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈ పర్యటనలో పాల్గొంది. అమీర్ భారత్ లో పర్యటించడం ఇది రెండోసారి.

గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్ వద్ద అధికార లాంఛనాలతో అమీర్ కు స్వాగతం పలికారు. అమీర్ గౌరవార్థం ఆయనకు, ఆయన వెంట ఉన్న ప్రతినిధి బృందానికి రాష్ట్రపతి విందు ఏర్పాటు చేశారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఫిబ్రవరి 18న హైదరాబాద్ హౌజ్‌లో అమీర్ తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఇరు దేశాల మధ్య గల చారిత్రక వాణిజ్య సంబంధాలను, రెండు దేశాల ప్రజల మధ్య గల ప్రగాఢ సంబంధాలను, దృఢంగా ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను ఇరువురు నేతలు గుర్తు చేసుకున్నారు. ఇరు దేశాల మధ్య గల బహుముఖ సంబంధాలను మరింత విస్తరించాలన్న ఆకాంక్షను వారు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య 'ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్య ఏర్పాటు ఒప్పందం' పై సంతకాలు జరగడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

కొత్తగా కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, రాజకీయ, వాణిజ్య, పెట్టుబడులు, భద్రత, ఇంధనం, సంస్కృతి, విద్య, సాంకేతికత, సృజనాత్మకత, సుస్థిరత, ప్రజల మధ్య సంబంధాలతో సహా అన్ని రంగాలలో క్రమం తప్పకుండా, నిర్మాణాత్మక సహకారం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇరు పక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. సవరించిన ద్వంద్వ పన్నుల తొలగింపు ఒప్పందంపై సంతకాలు జరిగినందుకు ఇరు పక్షాలు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు, భారత్-ఖతార్ ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందంపై చర్చలను వేగవంతం చేయడానికి అంగీకరించాయి.

వివిధ స్థాయిల్లో క్రమం తప్పకుండా జరుగుతున్న చర్చలు బహుముఖ ద్వైపాక్షిక సహకారానికి ఊతమిచ్చేందుకు దోహదపడ్డాయని ఇరు పక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. 2015 మార్చిలో విజయవంతంగా జరిగిన అమీర్ భారత్ పర్యటన, ఆ తరువాత 2016 జూన్, 2024 ఫిబ్రవరిలో ఖతార్ లో భారత ప్రధాని పర్యటనలను వారు గుర్తు చేసుకున్నారు. మంత్రుల స్థాయిలోనూ, సీనియర్-అధికారుల స్థాయిలోనూ క్రమం తప్పకుండా ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా ఉన్నత స్థాయి చర్చలను కొనసాగించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయి.

ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సహకారానికి వ్యాపార, వాణిజ్యాలు బలమైన పునాదిగా ఉన్నాయని గుర్తించిన ఇరు పక్షాలు, ద్వైపాక్షిక వాణిజ్యంలో మరింత వృద్ధి, వైవిధ్యతకు ఉన్న అవకాశాలను అన్వేషించాలని అభిప్రాయపడ్డాయి. వ్యాపారం, వాణిజ్యంపై ప్రస్తుతం ఉన్న జాయింట్ వర్కింగ్ గ్రూప్ ను వ్యాపార, వాణిజ్య సంయుక్త కమిషన్‌గా స్థాయి పెంచడాన్ని ఇరు పక్షాలు స్వాగతించాయి. రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను సమీక్షించడానికి, పర్యవేక్షించడానికి జాయింట్ కమిషన్ ఒక సంస్థాగత యంత్రాంగంగా ఉంటుంది. రెండు దేశాల వాణిజ్య, పరిశ్రమల మంత్రులు దీనికి నేతృత్వం వహిస్తారు.

రెండు దేశాల వ్యాపార, పారిశ్రామిక సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో 2025 ఫిబ్రవరి 13న జాయింట్ బిజినెస్ కౌన్సిల్ తొలి సమావేశం నిర్వహించడాన్ని వారు స్వాగతించారు.

రెండు దేశాల మధ్య మరింత విస్తృతమైన, విభిన్నమైన వాణిజ్యాన్ని అభివృద్ధి చేసే వ్యూహాలను అన్వేషించాల్సిన అవసరాన్ని రెండు దేశాలూ అంగీకరించాయి. వస్తుసేవల వాణిజ్యానికి సంబంధించిన మార్కెట్ అందుబాటులో ఎదురయ్యే సమస్యలను ప్రాధాన్యతాధారితంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని కూడా గుర్తించాయి. ఈ మేరకు ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకునే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

భారత్, ఖతార్ దేశాలు బలమైన వ్యూహాత్మక సంబంధాలను కలిగి ఉన్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్న నేపథ్యంలో, భారత్‌లో కార్యాలయాన్ని ప్రారంభించాలని ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఎ) తీసుకున్న నిర్ణయాన్ని భారతదేశం స్వాగతించింది. పెట్టుబడుల జాయింట్ టాస్క్ ఫోర్స్ జూన్ 2024లో, తన మొదటి సమావేశంలో సాధించిన పురోగతిపై ఇరు పక్షాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. భారతదేశంలో పెట్టుబడులకు వివిధ మార్గాల గురించి ఆ సమావేశంలో చర్చించారు.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ సంస్థాగత పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించడంలో భారత్ తీసుకున్న చర్యలను ఖతార్ బృందం ప్రశంసించింది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, తయారీ, ఆహార భద్రత, లాజిస్టిక్స్, ఆతిథ్యం సహా ఇతర పరస్పర ప్రయోజన రంగాలలో పెట్టుబడి అవకాశాలను అన్వేషించడానికి ఆసక్తిని వ్యక్తం చేసింది. ఈ మేరకు భారత్ లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని ఖతార్ ప్రకటించింది. పెట్టుబడుల వాతావరణాన్ని పెంపొందించడంలో ఖతార్ చేస్తున్న ప్రయత్నాలను, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు ఖతార్ తీసుకుంటున్న చర్యలను భారత్ అభినందించింది. వస్తుసేవలకు ప్రాంతీయ కేంద్రంగా ఖతార్ పాత్ర పెరుగుతోందని గుర్తిస్తూ, ఖతార్ కు గల వ్యూహాత్మక ప్రాధాన్యం, ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల విధానాలను అందిపుచ్చుకోవడానికి భారత్ ఆసక్తి వ్యక్తం చేసింది. పెట్టుబడులు, వాణిజ్య విస్తరణకు కొత్త అవకాశాలను అన్వేషించడానికి ఇరుదేశాల పెట్టుబడి సంస్థలు , ఆర్థిక సంస్థలు, వ్యాపార సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాల్సిన ప్రాముఖ్యతను ఇరు పక్షాలు గుర్తించాయి.

తమ తమ చట్టాలు, తాము భాగస్వాములుగా ఉన్న అంతర్జాతీయ ఒప్పందాల నిబంధనలకు అనుగుణంగా పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య,ఆర్థిక సహకారాన్ని విస్తరించి, మరింత బలోపేతం చేయడానికి రెండు దేశాలు అంగీకరించాయి. స్థిరమైన వృద్ధిని సాధించడానికి, వాణిజ్య వైవిధ్యానికి మార్పిడి ఉత్పత్తుల పరిమాణాన్ని పెంచడానికి, క్రమ పద్ధతిలో, దీర్ఘకాలిక ప్రాతిపదికన పరస్పర సేవలను అందించడానికి రెండు దేశాలు సహకరించుకుంటాయి. అదనంగా, రెండు దేశాల ప్రైవేట్ రంగాల మధ్య ఉమ్మడి ప్రాజెక్టుల ఏర్పాటును ఆకర్షించడానికి, ప్రోత్స హించడానికి చర్యలు చేపడతాయి. ఇందుకు సంబంధించి 2025 ఫిబ్రవరి 18న జరిగిన జాయింట్ బిజినెస్ ఫోరం సమావేశాన్ని ఇరు పక్షాలు స్వాగతించాయి. ఇరు దేశాల వాణిజ్య, పరిశ్రమల మంత్రులు ఈ సమావేశాన్ని ప్రారంభించారు.

ఆర్థిక వృద్ధి లో వ్యాపారాల కీలక పాత్రను గుర్తించిన ఇరు పక్షాలు, వాణిజ్య భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచడానికి, వైవిధ్యపరచడానికి, పెట్టుబడులను సులభతరం చేయడానికి వ్యూహాత్మక వేదికగా వాణిజ్య ప్రదర్శనల నిర్వహణ ప్రాముఖ్యతను అంగీకరించాయి. ఈ లక్ష్యాల సాధనలో భాగంగా, రెండు దేశాల ఎగుమతి ప్రోత్సాహక సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయాలని రెండు దేశాలు అంగీకరించాయి. ఇది సంస్థలకు అవకాశాలను గుర్తించడం, మార్కెట్ సవాళ్లను అధిగమించడం, అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలలో పాల్గొనడాన్ని ప్రోత్సహించేందుకు మద్దతు ఇస్తుంది. ఈ కార్యక్రమం ఇరు దేశాలకు చెందిన వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి, ఉమ్మడి భాగస్వామ్యాలను అన్వేషించడానికి , వాణిజ్య సంబంధాలను సుస్థిర పరుచుకోవడానికి వీలు కల్పిస్తుంది.

ఖతార్ లోని క్యూఎన్ బీ పాయింట్స్ ఆఫ్ సేల్స్ లో భారతదేశ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ (యుపిఐ) అమలును ఇరు పక్షాలు స్వాగతించాయి. ఖతార్ దేశవ్యాప్తంగా కూడా భారత యుపిఐ అమలుపై ఆశాభావం వ్యక్తం చేశాయి.ద్వైపాక్షిక వాణిజ్య లావాదేవీలను పరస్పర కరెన్సీలతో నిర్వహించడాన్ని పరిశీలించడానికి వారు అంగీకరించారు. గిఫ్ట్ సిటీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా క్యూ ఎన్ బి విస్తరణను స్వాగతించారు.

ఇంధన మౌలిక సదుపాయాల్లో వాణిజ్యం, పరస్పర పెట్టుబడులను ప్రోత్సహించడం, ఇంధనంపై జాయింట్ టాస్క్ ఫోర్స్ తో సహ తరచూ ఇరు దేశాలకు చెందిన సంబంధిత వాటాదారుల సమావేశాలతో ద్వైపాక్షిక ఇంధన సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఇరు పక్షాలు అంగీకరించాయి.

సరిహద్దు ఉగ్రవాదం సహా అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించిన ఇరువురు నేతలు ద్వైపాక్షిక, బహుపాక్షిక యంత్రాంగాల ద్వారా ఈ ముప్పును ఎదుర్కోవడానికి పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. సమాచార, నిఘా భాగస్వామ్యం, అనుభవాలు, అత్యుత్తమ విధానాలు, సాంకేతికతలను మెరుగుర్చుకోవడం అలాగే పరస్పరం పంచుకోవడం, సామర్థ్యాలను పెంపొందించుకోవడం, చట్టాల అమలుతో పాటు, మనీలాండరింగ్, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, అలాగే ఇతర అంతర్జాతీయ నేరాలను నిరోధించడంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాల నేతలు నిర్ణయించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం అలాగే సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేందుకు సైబర్‌స్పేస్‌ను ఉపయోగించడం వంటి చర్యలను సమర్థంగా ఎదుర్కోవడానికి సైబర్ భద్రతలో సహకారాన్ని మరింత ప్రోత్సహించే మార్గాలపై ఇరుపక్షాల నేతలు చర్చించారు. భద్రత, చట్టాల అమలు కోసం ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ కమిటీ తరచూ సమావేశమవ్వాల్సిన ప్రాముఖ్యతను వారు ప్రధానంగా ప్రస్తావించారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో ఆరోగ్య రంగ సహకారం అత్యంత కీలకమని అభిప్రాయపడిన ఇరుపక్షాలు, ఈ ప్రాధాన్య రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం పట్ల తమ నిబద్ధతను వ్యక్తం చేశాయి. ఆరోగ్యరంగంలో సంయుక్త కార్యాచరణ బృందం సేవలు సహా కోవిడ్-19 మహమ్మారి సమయంలో ద్వైపాక్షిక సహకారాన్ని ఇరువక్షాలు ప్రశంసించాయి. ఖతార్ కు భారత ఔషధ ఉత్పత్తులు, వైద్యపరికరాల ఎగుమతులను పెంచడానికి భారత్ సుముఖత వ్యక్తం చేసింది. అలాగే జాతీయ కంపెనీలు, ఔషధ ఉత్పత్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయాలనే కోరికను ఇరుదేశాలు ప్రస్తావించాయి.

అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అంకురసంస్థలు, కృత్రిమ మేధ సహా సాంకేతిక, ఆవిష్కరణల రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం పట్ల ఇరుపక్షాలు ఆసక్తి వ్యక్తం చేశాయి. డిజిటల్ రంగంలో ఇ-గవర్నెన్స్‌ను మరింత ముందుకు తీసుకెళ్లడానికి అలాగే అత్యుత్తమ విధానాలను పంచుకోవడం కోసం గల మార్గాలను వారు చర్చించారు. 2024-25లో ఖతార్ లోని దోహలో జరిగే వెబ్ సదస్సుల్లో భారత అంకురసంస్థలు పాల్గొనడాన్ని ఇరుపక్షాలు స్వాగతించాయి.

ఆహార భద్రత, సప్లయి చెయిన్స్ భద్రతల ప్రాముఖ్యత గురించి ప్రధానంగా ప్రస్తావించిన ఇరుపక్షాలు, ఆయా రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించాయి.

ఇరు దేశాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పరస్పరం పాలుపంచుకోవడం, సాంస్కృతిక సంస్థల మధ్య ప్రభావవంతమైన భాగస్వామ్యాలకు ఊతమివ్వడం ద్వారా సాంస్కృతిక సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఇరుపక్షాలు ప్రస్తావించాయి. పరస్పర పోటీలు, క్రీడాకారుల సందర్శనలు, కార్యశాలలు, సెమినార్లు అలాగే సమావేశాలను నిర్వహించడం, ఇరు దేశాల క్రీడా ప్రచురణలు పరస్పరం పంచుకోవడం సహా క్రీడారంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సైతం వారు నిర్ణయించారు. ఈ విషయంగా, సమీప భవిష్యత్తులో భారత్-ఖతార్ సంస్కృతి, స్నేహం అలాగే క్రీడా సంవత్సర వేడుకలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని ఇరు పక్షాలు స్వాగతించాయి.

ఇరుదేశాల ఉన్నత విద్యాసంస్థల మధ్య సంస్థాగత సంబంధాలు, పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం సహా విద్యారంగంలో సహకారం అత్యంత ముఖ్యమైనదిగా ఇరుపక్షాలు అభివర్ణించాయి. విద్యా

# అసోంలోని జోగిఘోపాలో అంతర్దేశీయ జలమార్గ టర్మినల్ ప్రారంభం.. ప్రధాన మంత్రి ప్రశంసలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:అసోంలోని జోగిఘోపాలో బ్రహ్మపుత్ర (జాతీయ జలమార్గం-2)పై అంతర్దేశీయ జలమార్గ రవాణా (ఐడబ్ల్యూటీ) టర్మినల్‌ను ప్రారంభించడాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు.

కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు, ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ భూటాన్ ఆర్థిక మంత్రి శ్రీ ల్యోన్‌పో నాంగ్యాల్ దోర్జీతో కలసి, అసోంలోని జోగిఘోపాలో అంతర్దేశీయ జలమార్గ రవాణా (ఐడబ్ల్యూటీ) టర్మినల్‌ను ప్రారంభించారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుతో సంధానించిన, వ్యూహాత్మకంగా జోగిఘోపాలో ఏర్పాటు చేసిన ఈ అత్యాధునిక టర్మినల్.. అసోంలోను, ఈశాన్య ప్రాంతాల్లోను లాజిస్టిక్స్ సదుపాయాల్ని, సరకుల చేరవేతకు అవకాశాల్ని మరింతగా పెంచుతూ భూటాన్, బంగ్లాదేశ్‌లకు అంతర్జాతీయ ప్రయాణాలలో విరామానికి ఉపయోగపడే ఓ ఓడరేవుగా కూడా నిలుస్తుంది.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కేంద్ర మంత్రి శ్రీ సోనోవాల్ పొందుపరిచిన ఒక సందేశానికి శ్రీ మోదీ ప్రతిస్పందిస్తూ -

''మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్న, దేశ ప్రగతి సాధన, సమృద్ధిలలో అంతర్దేశీయ జలమార్గాల పాత్రను ప్రోత్సహిస్తూ ముందుకుపోవాలన్న మన ప్రయత్నాల్లో చెప్పుకోదగ్గ మరొక విజయమిది" అని పేర్కొన్నారు.

# ఎస్ఓయూఎల్ నాయకత్వ ఫిబ్రవరి 21, 22లలో న్యూ ఢిల్లీలో చర్చావేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:ఎస్ఓయూఎల్ (స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్) వారు నాయకత్వ చర్చావేదిక కార్యక్రమాన్ని ఈ నెల 21న న్యూ ఢిల్లీలో నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

నాయకత్వానికి సంబంధించిన అంశాల్ని చర్చించడానికి జీవనంలో వివిధ రంగాలకు చెందిన వారిని ఈ వేదిక ఒక చోటుకు తీసుకువస్తుందని శ్రీ మోదీ అన్నారు. వక్తలు వారి ప్రేరణాత్మక జీవన యాత్రలను గురించి, కీలక అంశాలపై వారి ఆలోచనల గురించి తెలియజేస్తారని, ఈ కార్యక్రమం ప్రత్యేకించి యువ శ్రోతలను ఆకట్టుకోగలదని కూడా శ్రీ మోదీ చెప్పారు.

ఎన్ఓయుఎల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌ను ఈ నెల 21, 22 లలో న్యూ ఢిల్లీలో ఏర్పాటు చేస్తున్నందుకు స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్‌ను నేను అభినందిస్తున్నాను. నాయకత్వానికి సంబంధించిన అంశాల్ని చర్చించడానికి జీవనంలో వివిధ రంగాలకు చెందిన వారిని ఈ వేదిక ఒక చోటుకు తీసుకువస్తుంది. వక్తలు వారి ప్రేరణాత్మక జీవన యాత్రలను గురించి, కీలక అంశాలపై వారి ఆలోచనల గురించి తెలియజేస్తారు. ఈ కార్యక్రమం ప్రత్యేకంగా యువ శ్రోతలను ఆకర్షిస్తుంది.

# రైతులకు శుభవార్త చెప్పిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశవ్యాప్తంగా ఉండే రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. అన్నదాతల పెట్టుబడుల సహాయార్థం ఇచ్చే పిఎం కిసాన్ పథకం 19వ విడత విడుదల తేదీని కేంద్రం ప్రకటించింది.

బిహార్‌లోని భాగల్పూర్‌లో ఈ నిధులను ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేస్తారు. తద్వారా ఇందులో నమోదు చేసుకున్న ప్రతి రైతు ఖాతాలో రూ.2వేలు జమా కానున్నాయి. ఈ పథకం ద్వారా 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరు తుందని అధికారులు తెలిపారు.

ఈ నిధులను అందుకోవాలంటే.. ఇ- కెవైసి పూర్తి చేసి.. ఎన్‌పిసిఐ, ఆధార్‌తో అనుసంధానించిన బ్యాంకు ఖాతా ఉండటం తప్పనిసరి. పిఎం కిసాన్ వెబ్‌సైట్‌లో తమ స్టేటస్ కానీ, రైతుల పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చని అన్నారు.

# రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలలో వచ్చే ఫలితాలకు జవాబుదారీ మీరే ..

## -కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ టతిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కాంగ్రెస్ పార్టీలో భారీ ఎత్తున సంస్థాగతంగా మార్పులు చేర్పులు చేసిన కొన్ని రోజుల తరువాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం పార్టీ అగ్రశ్రేణి కార్యనిర్వాహకవర్గ సభ్యులతో కరాఖండిగా మాట్లాడారు. తమ ఆధ్వర్యంలోని రాష్ట్రాల్లో భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో వచ్చే ఫలితాలకు వారిని జవాబుదారీ చేయనున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. సైద్ధాంతికంగా బలహీనులైన ఫిరాయింపుదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వారిని ఖర్గే కోరారు. క్రితం వారం నియుక్తులైన వారితో సహా పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌లను ఉద్దేశించి ఢిల్లీ ఇందిరా భవన్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఖర్గే ప్రసంగిస్తూ, కాంగ్రెస్ సిద్ధాంతానికి నిబద్ధులైనవారిని, ప్రతికూల పరిస్థితుల్లోనూ తమకు దన్నుగా నిలబడేవారిని ప్రోత్సహించడం ప్రధానమని ఉద్ఘాటించారు .సంస్థాగతంగా మరి కొన్ని మార్పులు జరగవచ్చునని కూడా ఖర్గే సూచించారు. ఇప్పటికే కొన్ని మార్పులు జరిగాయని, మరి కొన్ని జరగబోతున్నాయని ఆయన చెప్పారు. పునర్వ్యవస్థీకృత సంస్థలో కొత్త ఆఫీస్‌బేరర్లను పార్టీ ఇటీవల తీసుకువచ్చింది. సమావేశానికి హాజరైన వారిలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ. సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ వాద్రా, కెసి వేణుగోపాల్, జైరామ్ రమేష్, అందరు ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లు కూడా ఉన్నారు. 'ఓటర్ల జాబితా తప్పులతడకల' గురించి కూడా ఖర్గే సమావేశంలో ప్రస్తావించారు.అది ఎన్నికల్లో పెద్ద ఎత్తున సంభవిస్తున్నదని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో దీని గురించి ఒక ప్రశ్న కూడా లేవనెత్తారని ఆయన గుర్తు చేశారు.'ఇటీవలి రోజుల్లో మన మద్దతుదారుల పేర్లను ఓటర్ల జాబితాలో నుంచి తొలగించిన విషయం మీరంతా గ్రహించాలి. లేదా పేరు తొలగించి, పొరుగు బూత్ జాబితాలో చేరుస్తున్నారు. సరిగ్గా ఎన్నికలకు ముందు కొత్త పేర్లను బిజెపి చేరుస్తోంది. ఈ రిగ్గింగ్‌ను ఎటువంటి పరిస్థితుల్లోను ఆపాలి' అని ఖర్గే స్పష్టం చేశారు.సుప్రీం కోర్టు ఉత్తర్వు మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఎంపిక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) పేరును ఇంతకుముందు చేర్చారని, కానీ మోడీ ప్రభుత్వం కమిటీలో నుంచి సిజెఐని తొలగించిందని ఖర్గే ఆరోపించారు.ప్రభుత్వం తుదకు దేశ ప్రధాన న్యాయమూర్తి నిష్పాక్షికతను కూడా విశ్వసించడం లేదు. ఈ వ్యవహారం సుప్రీం కోర్టులో విచారణ జరగవలసి ఉన్నది కానీ ప్రభుత్వం దానికి ముందే కొత్త సిఇసి పేరును ప్రకటించింది. ప్రతిపక్ష నాయకుని కేవలం నిర్ధారణ కోసం ఉపయోగించుకుంటున్నప్పుడు అటువంటి ఎంపిక కమిటీ వల్ల ఏమి ప్రయోజనం అని రాహుల్‌జీ కూడా అన్నారు' అని ఖర్గే తెలిపారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత సమస్యలను కూడా ఖర్గే ప్రస్తావించారు.వాటి పరిష్కారంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. సంస్థను బలోపేతం చేయవలసిందిగా ఆఫీస్‌బేరర్లకు ఖర్గే విజ్ఞప్తి చేశారు.'రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి బూత్ స్థాయి వరకు సాధ్యమైనంత త్వరగా సంస్థను బలేపేతంచేయవలసిన బాధ్యత మీది. ఈ పని కోసం మీరు స్వయంగా బూత్‌కు వెళ్లి, కష్టించి పని చేసి, కార్యకర్తలతో మాట్లాడవలసి ఉంటుంది. మన సంస్థాగత విభాగాలకు కూడా ప్రమేయం కల్పించవలసి ఉంటుంది. మనలో ఒక ముఖ్య భాగమైన భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) గురించి మాట్లాడాలని అనుకుంటున్నా. సంస్థాగత నిర్మాణంలో వారిని కూడా భాగస్వాములను చేయాలి' అని ఖర్గే చెప్పారు. ఖర్గే సమావేశంలో తన తొలి పలుకుల్లో ఢిల్లీ మార్పు కోసం వోటు వేసిందని పేర్కొన్నారు.వనరుల కొరత ఉన్నప్పటికీ గట్టి పోటీ ఇచ్చినందుకు రాష్ట్ర నాయకత్వాన్ని ఆయన కొనియాడారు. బిజెపి 26 ఏళ్లకు పైగా తరువాత ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన విషయం విదితమే. బిజెపి అసెంబ్లీలోని 70 సీట్లలోకి 48 సీట్లను గెలుచుకున్నది. ఆప్ 22 సీట్లు గెలుచుకోగా కాంగ్రెస్‌కు ఒక్కటీ దక్కలేదు. ఖర్గే ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, యుఎస్‌ఎ నుంచి తిప్పిపంపుతున్న భారతీయులకు అవమానాన్ని అడ్డుకోవడంలో ప్రధాని విఫలమైనట్లు విమర్శించారు. 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమం వచ్చే సంవత్సరం కూడా కొనసాగుతుందని ఖర్గే ప్రకటిస్తూ, పాదయాత్ర, చర్చలు కూడలి సమావేశాలు వంటివి నిర్వహించవచ్చునని సూచించారు.

# దార్ ముఠా గ్యాంగ్ లీడర్ అస్రఫ్ ఖాన్ అరెస్ట్

**-నార్కట్ పల్లి వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో దోపిడీ**
**-రూ. 25 లక్షలు చోరీ**
**-పరారీలో ముగ్గురు ముఠా సభ్యులు.**
**-రూ. 25 లక్షల నగదు, కారు స్వాధీనం.**
**-ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి**

నల్లగొండ, ఫిబ్రవరి 20: కరుడుగట్టిన మహారాష్ట్రకు చెందిన అంతర్ రాష్ట్ర దార్ దొంగల ముఠా గ్యాంగ్ లీడర్ మహమ్మద్ అస్రఫ్ ఖాన్ ను నల్లగొండ పోలీసులు అరెస్టు చేశారని, నిందితుడిని నుండి రూ. 25 లక్షలు, కారును స్వాధీనం చేసుకున్నారు. అస్రఫ్ ఖాన్ అరెస్టుకు సంబంధించిన వివరాలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.




**నార్కెట్‌పల్లి వద్ద రూ.25 లక్షలు చోరీ**

చెన్నై నుండి హైదరాబాద్‌కు ఈ నెల 9 వ తేదీన వెళ్తున్న శ్యామ్ సర్దార్ ట్రావెల్స్ బస్సు ను ప్రయాణికులు టిఫిన్ చేసేందుకు నార్కెట్ పల్లి పూజిత హోటల్ వద్ద దిగారు. చెన్నై నుండి హైదరాబాద్ వెళ్తున్న ప్రయాణికుడు నెల్లూరు కు చెందిన బోయిన వెంకటేశ్వర్లు బస్సులోనే రూ. 25 లక్షల నగదు ఉన్న బ్యాగును ఉంచి కిందకు దిగాడు. అదే సమయంలో అస్రఫ్ ఖాన్ తోపాటు మరో ముగ్గురు బస్సులో నుంచి రూ. 25 లక్షల బ్యాగును చోరీ చేసి కారులో హైదరాబాదుకు వెళ్లారు. అదేరోజు బాధితుడు నార్కెట్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ శరత్ చంద్ర పవార్ దొంగల ఆచూకీ కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

**సీసీ కెమెరాల ఆధారంగా విచారణ**

నిందితులు కారులో హైదరాబాదుకు వెళ్లారని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు అదే కోణంలో విచారణ చూట్టారని, నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించారని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

నిందితులు మధ్యప్రదేశ్ లోని దార్ జిల్లాలోని మన్‌వార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నట్లు గుర్తించి అక్కడ గ్యాంగ్ లీడర్ అస్రఫ్ ఖాన్ ను అరెస్టు చేసినట్టు చెప్పారు. అతన్ని అక్కడి కోర్టులో హాజరు పరిచి నల్లగొండకు కోర్టు అనుమతితో తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. పట్టుబడ్డ అస్రఫ్ ఖాన్ ను విచారించగా లైబ్ ఖాన్, అక్రమ్ ఖాన్, మహబూబ్ ఖాన్ లతో కలిసి చోరీ చేసినట్లు అంగీకరించాడన్నారు. మిగిలిన ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితులపై మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో పలు కేసులు నమోదు అయినట్లు ఆయన తెలిపారు. చాకచక్యంగా అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న జిల్లా పోలీసులను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

# 15 నెలల తరువాత ప్రజలు గుర్తుకు వచ్చారా..

## -టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

హైదరాబాద్ ఫిబ్రవరి 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );15 నెలల తరువాత ప్రజలు గుర్తుకు వచ్చారా అని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూటిగా ప్రశ్నించారు. బుదవారం గాంధీ భావన లో మెడియా సమావేశం లో మాట్లాడుతూ అసెంబ్లీ లో ప్రజల గొంతుకగా మాట్లాడుతారని ఆశించామన్నారు. బీజేపీ పార్టీ లోపలకార ఒప్పందం తోనే ఎంఎల్సీ ఎన్నికల్లో పోటీచేయలేదన్నారు. ప్రభుత్వం ప్రాతిష్ఠాత్మికగా కులగణన చేస్తే కనీసం కేసీఆర్ స్పందన లేదు.. ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోచించడం లో పూర్తి విఫలం అయ్యారని విమర్శించారు. కెసిఆర్ కేవలం స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాజకీయ నాటకం ఆడుతున్నారని,కెసిఆర్ తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీజేపీ పార్టీ కి బీ టీమ్ వ్యవరిస్తుందన్నారు. ఖీఠా భవన్ కు కెసిఆర్ వస్తే అదేదో అద్భుతం లాగా మాట్లాడుతున్నారు.. కెసిఆర్ ఎతీఓ భవన్ వస్తే బూడిద కూడా రాలదు.. కెసిఆర్ ప్రజల విశ్వాసాలను కోల్పోయిన వ్యక్తి అని అన్నారు.

# ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి



## -ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి
## -మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే? కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది? ఇప్పటికైనా కళ్లు తెరవాలి..

నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు? కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది? ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది? ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది? ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు.

### నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం..

యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, దిల్లీలో ధర్నా చేద్దాం? మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే? ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

### నీటిని తరలించుకుపోతుంటే శిలావిగ్రహాల్లా చూస్తున్నారు..

బీఆర్ఎస్ ప్రభుత్వం లేనందువల్ల, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉన్నందువల్ల నీటిని తరలించుకునేందుకు చంద్రబాబుకు సులువు అయింది. ఇష్టం వచ్చినట్లు జలదోపిడీ జరుగుతోంది, ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి పరోక్షంగా సహకరిస్తున్నారు. ఈ ఏడాది ఇవాళ్టి వరకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదు. కృష్ణా బోర్డు కేంద్రం నియంత్రణలో ఉందా? ఏపీ నియంత్రణలో ఉందా? అన్న అనుమానం కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. నీటిని తరలించుకుపోతుంటే శిలావిగ్రహాల్లా చూస్తున్నారు. అవసరమైతే అఖిల పక్షాన్ని దిల్లీకి తీసుకెళ్ళి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఉండి ఏం లాభం? కేంద్ర మంత్రిగా ఉండి నీళ్ళు తెస్తారా? చంద్రబాబుకు వత్తాసు పలుకుతారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### గురు దక్షిణ చెల్లించుకుంటున్నారేమో..

ప్రధాని, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఇంటి ముందు ధర్నా చేద్దాం. రాష్ట్రం కోసం ఉపయోగపడని పదవులు ఎందుకు? సందర్భాన్ని బట్టి స్పందించాలి. నాగార్జున సాగర్ నుంచి సీఆర్పీఎఫ్ బలగాలు ఉపసంహరించాలి, లేదంటే శ్రీశైలంలో కూడా పెట్టాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చేత కావడం లేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా చూడాలి. ప్రాజెక్టులకు అనుమతులు తేవడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. 15 నెలలు అయినా ప్రాజెక్టులకు అనుమతులు తేవాల్సింది? డీపీఆర్‌లు వెనక్కు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మేడిగడ్డను పండబెట్టారు, ఆర్నెళ్లలో మరమ్మత్తులు పూర్తి చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు. ఏపీ యథేచ్ఛగా నీరు తీసుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రాన్ని కోరడం కాదు? ఇప్పుడు పోతున్న నీటి గురించి మాట్లాడాలి, కేంద్ర మంత్రి ఇంటి ముందు ధర్నా చేస్తే బాగుంటుంది. కేసీఆర్ ప్రతినిత్యం సమీక్ష చేసేవారు? ఇప్పుడు సీఎం, మంత్రి కనీసం పట్టించుకోవడం లేదు. గత పాలకుల పుణ్యం కారణంగానే తెలంగాణకు 299 టీఎంసీల తాత్కాలిక కేటాయింపు జరిగింది. తెలంగాణకు 575 టీఎంసీల నీరు తెచ్చుకునేందుకు సెక్షన్ 3 దోహదపడుతుంది. కేవలం నిర్లక్ష్యం, వైఫల్యం, లొంగిపోయిన కారణంగానే నీటి దోపిడి. రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య పరోక్ష సంబంధం? గురు దక్షిణ చెల్లించుకుంటున్నారేమో? రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేయాలి, మేమూ కలిసి వస్తాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు అన్యాయమే : డొనాల్డ్ ట్రంప్

వాషింటోన్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రికల్ వాహనాల తయారీ కంపెనీ టెస్లా (వబక్రీజీ) భారత్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌లోకి టెస్లా ప్రవేశించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మస్క్ నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకిస్తూ.. ఇది అన్యాయమే అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తో సమావేశమైన రోజుల వ్యవధిలోనే టెస్లా సంస్థ భారత్‌లో ఉద్యోగ నియామకాలు చేపట్టింది. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాల్లో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు కూడా ప్రయత్నాలు మొదలు పెట్టింది. కాగా, ఎలాన్ మస్క్‌తో కలిసి ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఈ ప్రపంచంలోని ప్రతీ దేశం తమను వాడుకోవాలని ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించారు. సుంకాలతో లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మస్క్ భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి రెడీ అవుతున్నారని.. ఆయన వరకు అది మంచి విషయమే కావొచ్చన్నారు. కానీ, అమెరికా పరంగా చూస్తే మస్క్ నిర్ణయం చాలా అన్యాయమే అవుతుందని వ్యాఖ్యానించారు. మస్క్ ముందే ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.ఇక ఇదే ఇంటర్వ్యూలో గత వారం ప్రధాని మోదీతో భేటీ విషయాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ఈ మీటింగ్‌లో విద్యుత్ కార్లపై అధిక పన్నుల విషయాన్ని మోదీ తన వద్ద ప్రస్తావించినట్లు ట్రంప్ చెప్పారు. ట్యాక్సుల సమన్వయను పరిష్కరించుకోవడంతో పాటు వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఇరు దేశాలు కలిసి పని చేసేలా నిర్ణయించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు.

# 'శీష్ మహల్'ను మ్యూజియంగా మారుస్తా

## - ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:(ఎక్స్ ప్రెస్ న్యూస్ );కొత్త ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై కొనసాగుతున్న




సస్పెన్స్‌కు తెరపడింది. షాలిమాం బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేఖా గుప్తా ను ముఖ్యమంత్రిగా బీజేపీ అధిష్ఠానం బుధవారం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీకి నాలుగో మహిళా ముఖ్యమంత్రిగా ఆమె ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వివాదాస్పదంగా మారిన 'శీష్ మహల్' గురించి స్పందించారు.సివిల్ లైన్స్‌లో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లా 'శీష్ మహల్'ను ముఖ్యమంత్రి అధికారిక నివాసంగా ఉపయోగించేవారు. అయితే, గత కేజ్రీవాల్ హయాంలో ఆ మహల్ తీవ్ర వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన రేఖా గుప్తాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ బంగ్లాలో ఉంటారా..? అని మీడియా పశ్నించింది. దీనికి ఆమె 'లేదు.. లేదు' అంటూ సమాధానం ఇచ్చారు. అంతేకాదు.. 'శీష్ మహల్'ను మ్యూజియం గా మారుస్తామని వెల్లడించారు. తనను సీఎం పదవికి ఎంపిక చేసినందుకు ప్రధాని మోదీకి ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రధాని ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చనున్నట్లు స్పష్టం చేశారు.ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన అధికార నివాసం 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డు బంగళా విస్తరణ, మరమ్మతులు, అలంకరణల కోసం అధికంగా ఖర్చు పెట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. 2015 నుంచి గత అక్టోబర్ వరకు ముఖ్యమంత్రిగా ఆ బంగళాలో అరవింద్ కేజ్రీవాల్ నివసించారు. ఢిల్లీ సీఎం అధికార నివాసాన్ని దాదాపు రూ.80 కోట్ల ప్రజాధనంతో మరమ్మతులు చేపట్టినట్లు బీజేపీ ఆరోపిస్తోంది. ఆధునీకరణంలో భాగంగా టాయిలెట్‌లో గోల్డెన్ కమోడ్, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ వంటివి ఏర్పాటు చేసుకున్నారని బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. ఈ బంగ్లాను పునరుద్ధరించడంలో పెద్ద స్కామ్ జరిగిందనీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణలతో ఆ బంగళాకు శీష్ మహల్ అని బీజేపీ పేరు పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోవడానికి 'శీష్ మహల్' అంశం కూడా ఓ ప్రధాన కారణమే.

# నిజామాబాద్ జిల్లాలో కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి



నిజామాబాద్ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : జిల్లాలోని బోధన్ మండలం పెగడపల్లి గ్రామ శివారులో కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

పందుల వేటకు వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఓర్సు గంగారం, బాలమణి, కిషన్ గా గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధి కూలీగా మారిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ఇల్లెందు, ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆయన ఒక మధ్యతరగతి సాధారణ కుటుంబంలో పుట్టారు. ఉన్నత చదువులు చదివి జిల్లా కలెక్టర్ అయ్యారు. విధి నిర్వహణలో భాగంగా ఉపాధి కూలీ పనులను పరిశీలించడానికి వచ్చారు. చూసి ఊరికే ఉండకుండా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పట్టి మట్టిని తవ్వి, పారతో మట్టిని తట్టలో ఎత్తి మోశారు. ఆయనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ . గురువారం ఉదయం కలెక్టర్ జితేష్ పాటిల్.. టేకులపల్లి మండలంలోని సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రు తండా, కొత్త తండా గ్రామపంచాయతీలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి పలుగు పారా పట్టి పారం పాండు పనుల్లో పాల్గొన్నారు. స్వయంగా మట్టిని తట్టలోకి ఎత్తి దానిని మోశారు.

# హైదరాబాద్-విజయవాడ మార్గంలో ప్రయాణించే వారికి ఆర్టీసీ ప్రత్యేక రాయితీ

## -ఏసీ స్లీపర్, సూపర్ లగ్జరీలో 10%, రాజధాని ఏసీలో 8%

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) : హైదరాబాద్–విజయవాడ మార్గంలో ప్రయాణించే వారికి ఆర్టీసీ ప్రత్యేక రాయితీ కల్పించినట్టు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. లహరి–నాన్ ఏసీ స్లీపర్‌కమ్ సీటర్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో 10%, రాజధాని ఏసీ బస్సుల్లో 8% రాయితీ ఇస్తున్నట్టు వెల్లడించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం ష్ట్రబిబిజూ:// బిణబతీబిఞఎబీబ.తిని వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించారు.

# భారత్‌లో 30 శాతానికి పైగా తగ్గిన ఆత్మహత్యల మరణాల రేటు

న్యూ డిల్లీ ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారతదేశంలో ఆత్మహత్యల మరణాల రేటు 30 శాతానికి పైగా తగ్గిందని ది లాన్సెట్ పబ్లిక్ హెల్త్ అధ్యయనం తాజాగా వెల్లడించింది. ఆత్మహత్య మరణాల రేటు 1990లో లక్ష జనాభాకు 18.9గా ఉండేదని పేర్కొంది. అయితే 2019లో అది లక్ష జనాభాకు 13.1 శాతానికి, 2021లో లక్ష జనాభాకు 13 శాతానికి పడిపోయినట్లు వెల్లడించింది. 1990 నుంచి 2021 వరకూ భారత్‌లో ఆత్మహత్యల మరణాల రేటు 31.5 శాతానికి తగ్గినట్లు పేర్కొంది.లాన్సెట్ అధ్యయనం ప్రకారం.. ఆత్మహత్యల ద్వారా మరణాల రేటు తగ్గడం మగవారి కంటే ఆడవారిలోనే ఎక్కువగా కనిపించింది. 1990లో స్త్రీలలో ఆత్మహత్య మరణాల రేటు లక్ష జనాభాకు 16.8 శాతంగా ఉండగా.. అది 2021లో లక్ష జనాభాకు 10.3 శాతానికి తగ్గింది. ఇక 1990లో పురుషుల ఆత్మహత్యల రేటు లక్ష జనాభాకు 20.9 శాతంగా ఉంది. 2021 నాటికి అది లక్ష జనాభాకు 15.7కు తగ్గింది. '2020లో భారతదేశంలో అత్యధిక ఆత్మహత్యల మరణాల రేటు విద్యావంతులైన మహిళల్లోనే కనిపించింది. ఇందుకు కారణం కుటుంబ సమస్యలే' అని యూఎన్ వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్ పరిశోధకులు తెలిపారు.ఇక ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 740,000 ఆత్మహత్యలు నమోదవుతున్నాయి. అంటే సగటున ప్రతి 43 సెకన్లకు ఒకరు సూసైడ్ చేసుకుంటున్నారన్నమాట. గత మూడు దశాబ్దాల్లో వయస్సు- ప్రామాణిక మరణాల రేటు దాదాపు 40 శాతానికి తగ్గింది. లక్ష జనాభాకు 15 మరణాల నుంచి లక్ష జనాభాకు 9 మరణాలకు చేరింది. ఇందులో ఆడవారిలో మరణాల రేటు 50 శాతానికి క్షీణించగా.. పురుషుల్లో 34 శాతానికి తగ్గింది. మొత్తం మీద ఆత్మహత్యల మరణాల రేటు మగవారిలో లక్ష జనాభాకు 12.8 శాతంగా, స్త్రీలలో లక్ష జనాభాకు 5.4 శాతంగా ఉంది.

# ఫైబర్ నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు - ఛైర్మన్ సంచలన నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 20: కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా ఫైబర్ నెట్ కు పైసా ఆదాయం రాలేదని ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సంస్థలో ఉన్నతాధికారులు సహకరించడం లేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉన్నతాధికారులను తొలగిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఫైబర్ నెట్ బిజినెస్ హెడ్ గంధంచెట్టు సురేష్, ప్రొక్యూర్మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజలకు ఉద్వాసన పలికినట్లు తెలిపారు.

గత ప్రభుత్వ పెద్దలతో చేతులు కలిపి తొలగించిన ఉద్యోగులకూ జీతాలు చెల్లించారని జీవీ రెడ్డి మండిపడ్డారు. ఫైబర్ నెట్ లో సంస్కరణలు ప్రతిపాదిస్తూ 400 మంది ఉద్యోగులను తొలగించాలని ఆదేశించినా వారు పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ఆదేశాలపై ఎండీ, ఈడీ సంతకాలు చేయలేదన్నారు. ఇటీవల జీఎస్టీ అధికారులు ఫైబర్ నెట్ కు రూ.377 కోట్లు జరిమానా విధించిన విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు.

ఈ తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేదని, సంస్థకు రూపాయి ఆదాయం రాలేదని తెలిపారు. ఎండీ దినేశ్ కుమార్ ఒక్క ఆపరేటర్ ను కూడా కలవడం లేదని, కనీసం సిబ్బందికి టార్గెట్లు కూడా పెట్టడంలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శలపాలు చేయడానికి గత ప్రభుత్వ పెద్దలతో కలిసి దినేశ్ కుమార్ కుట్ర పన్నినట్లు జీవీ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. తొలగించిన ఉద్యోగులకు చెల్లించిన జీతాల సొమ్మును దినేశ్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారుల నుంచి వసూలు చేయాలంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అటవీ అధికార్లు వేధించారని గిరిజనుడి ఆత్మహత్యయత్నం



ఆదిలాబాద్, ఫిబ్రవరి 20:అటవీ అధికార్లు వేధించారని మండలంలోని గడ్డంగూడవాసి రాథోడ్ తుకారాం గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారు జామున మండలంలోని జన్నారం, కొత్తూరు పల్లె గ్రామ సమీపంలో ఉన్న గడ్డంగూడ చెందిన 22 మంది గిరిజనుల గుడిసెలను అటవీ అధికార్లు జేసీబీ, ట్రాక్టర్లతో తొలగించారు.

దీంతో ఆ గిరిజనులు నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలో గురువారం ఉదయం జన్నారం ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ ఎస్. సుష్మారావు ఆధ్వర్యంలో పలువురు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్,బీట్ ఆఫీసర్లు ఆ గడ్డంగూడ వద్దకు వెళ్లి సీసీ కెమెరాలు అ మార్చుతామని తెలిపారు.

దీంతో బాధిత గిరిజనుల్లో ఒకరైన రాథోడ్ తుకారాం,పలువురు గిరిజనులు రెండు రోజుల గడువు ఇవ్వాల్సిందిగా వేడుకున్నారు. అయినప్పటికీ సీసీ కెమెరాలు పెట్టడానికి అటవీ అధికారులు ఉపక్రమించారు.దీంతో తుకారాం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా, అక్కడున్న తోటి గిరిజనులు వెంటనే జన్నారం ఎఫ్డీఓ కార్యాలయానికి తరలించారు.

అక్కడే తుకారాంతో కుటుంబ సభ్యులు,పలువురు గిరిజనులు ధర్నాకు దిగారు.ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని చావు బతుకుల మధ్య ఉన్న తుకారాంను చికిత్స నిమిత్తం లక్షెటిపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ లో తరలించారు.

ప్రస్తుతం తుకారాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.తుకారాంకు ప్రాణాప్యాయమేమీ లేదని ఓ వైద్యుడు తెలిపారు.ఈ విషయమై ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావును వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జన్నారం అటవీ బీట్ లోని కంపార్ట్మెంట్ నెంబర్ 308 రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో సీసీ కెమెరాల అమర్చడానికి పోలీసులు,తన ఉద్యోగులతో వెళ్లానన్నారు.తాను ఎవరిని దూషించలేదని,వేధించలేదని ఆమె స్పష్టం చేశారు.

గడ్డంగూడ గిరిజనులను అటవీ అధికారిణి వేధించింది

పురుగుల మందు తాగి చావండి అంటూ అటవీ అధికారిణి తిట్టిందని లోత్రే మాజీ ఉప సర్పంచి బోడ శంకర్ ఆరోపించారు. స్థానిక ఎఫ్డీఓ కార్యాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గడ్డంగూడ ప్రాంతానికి ఆ అధికారిణి వచ్చి గిరిజనులను ఇష్టం వచ్చినట్టు తిట్టి, వేధించిందని ఆయన తెలిపారు. గిరిజనులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

గిరిజనులకు న్యాయం చేస్తా : ఇంచార్జి మంత్రి సీతక్క

గడ్డంగూడ అటవీ బాధిత గిరిజనులకు న్యాయం చేస్తానని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.జన్నారం గురువారం వచ్చిన జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కను పలువురు గడ్డంగూడ బాధిత గిరిజనులు కలిసి తమ గోడును విన్నవించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,తాను రాష్ట్ర ముఖ్యమంత్రితో అటవీ శాఖ మంత్రితో మాట్లాడి న్యాయం జరిగేలాగా చూస్తానన్నారు.ఆమె వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఉన్నారు.

# మహిళలు స్నానం చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో విక్రయం..

## -మెటా సాయం కోరిన యూపీ పోలీసులు

లక్నో ఫిబ్రవరి 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. 45 రోజుల పాటూ సాగే ఈ మహాకుంభమేళాలో ఇప్పటి వరకూ 57 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే, అక్కడ సంగమంలో స్నానాలు చేస్తున్న మహిళా భక్తులకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు తీసి కొందరు సోషల్ మీడియాలో విక్రయిస్తున్న ఉదంతం బయటకు వచ్చింది. దీనిపై యూపీ పోలీసులు చర్యలకు ఉపక్రమించారు.ఈ ఘటనపై ఇప్పటి వరకూ కోత్వాల్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఫిబ్రవరి 2న ఏనివష్ట్రజీ1224872024 అనే ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వీడియోలు, ఫొటోలు పోస్టు అయినట్లు గుర్తించారు. ఆ ఇన్‌స్టా ఖాతా నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు యూపీ పోలీసులు తెలిపారు. ఇందులో భాగంగా మెటా (ఓవబిజీ) సంస్థ నుంచి వివరాలు కోరినట్లు వెల్లడించారు. అంతేకాదు టెలిగ్రామ్ ఛానల్ అఉఎ అఊంఔఔఇఒ 11లో కూడా ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు..దర్యాప్తు చేపట్టారు.

# శ్రీకాకుళం జిల్లాలో నేడు జగన్ పర్యటన

అమరావతి, ఫిబ్రవరి 20: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఈరోజు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు.

ఇటీవల మృతి చెందిన పాలకొండ వైసీపీ నేత పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని ఆయన పరామర్శించనున్నారు.

నేటి ఉదయం 11 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు పాలకొండ చేరుకోనున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించనున్నారు. పరామర్శ అనంతరం పాలకొండ నుంచి నేరుగా బెంగుళూరుకు వెళ్లనున్నారు.

ఇటీవల వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం (81) అనారోగ్యంతో కన్నుమూశారు. రాజశేఖరం మృతి విషయాన్ని విజయనగరం జిల్లా జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు.. వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. రాజశేఖరం కుమారుడు పాలవలస విక్రాంత్, కుమార్తె శాంతిని జగన్ ఫోన్‌లో పరామర్శించారు. రాజశేఖరం మృతికి సంతాపం తెలిపారు.




